telangana chowrastha.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:300

24 క్యారెట్లు 1,54,950.00 | కిలో వెండి 2,55,000.00 | CHOWRASTHA DIGITALS | 23.05.2026 శనివారం, హైదరాబాద్


## మీకు ఇంకా రిజర్వేషన్లు అవసరమా..?



- తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులుగా ఉన్న పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకు
- ఇలాగే కొనసాగితే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేము
- రిజర్వేషన్ల అమలులో సమతుల్యత అవసరం
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- జస్టిస్ బి.వి. నాగారత్న,ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యలు

2



## రైతు పండించిన అన్ని రకాల పంటలను కొనాలి

- సచ్చె ఎండలో కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులు
- అక్కడ కనీసం టెంట్ మంచి నీటి సౌకర్యాలు కరువు
- మొక్కలు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలు కూడా కొనాలి
- సచివాలయం ముందు కవిత నిరసన
- రెండున్నరేండ్లుగా వ్యవసాయశాఖపై సీఎం రివ్యూ చేయలేదు
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి
- లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలే
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

2

# పంట కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కోటిన్నర టన్నుల పంటలో ఇంకా సగం కూడా కొనలేదు

బండి భగీరథ్ విషయంలో సీఎం, కేంద్రమంత్రి కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. నిందితుడు 9 రోజులపాటు పోలీసులకు దొరక్కుండా చూసింది ఎవరని ప్రశ్నించిన కేటీఆర్, ప్రధాని పర్యటన ఉన్నందున కేసు నమోదు చేయలేదని పోలీసులు అనడం సిగ్గుచేటన్నారు.

- రైతులను నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ సహించదు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎండలో రైతులు పడిగాపులు
- బండి, రేవంత్, కేంద్రమంత్రి కుమ్మక్కయ్యారు
- భగీరథ్ ను అప్పగించారని,అరెస్టు చేశామని ఇద్దరు కలిసి డ్రామాలు
- పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరు..?
- బీఆర్ఎస్ పోరాడకుండా ఉంటే బాలిక కుటుంబానికి న్యాయం జరిగేది కాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## ఆకునూరి మురళి రాజీనామా

- తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి గుడ్‌బై
- బాధ్యత పూర్తి చేశానంటూ సీఎస్‌కు లేఖ
- నాలుగు నెలల పదవీకాలం ఉండగానే రాజీనామా
- కేశవరావు కమిటీతో అప్రాధాన్యంగా మారిన కమిషన్
- విద్యకు బడ్జెట్‌లో 18శాతం కేటాయింపులు చేయాలని సూచన
- కమిషన్ గా తానొకటి చెబితే.. సర్కార్ మరోటి చేయడం
- సిఫార్సులను సర్కార్ పట్టించుకోవడం లేదని మనస్తాపం



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎస్ కే రామకృష్ణారావుకు తన రాజీనామా లేఖను పంపించారు. తనకు ఇచ్చిన బాధ్యతను పూర్తిచేశానని, బాధ్యత పూర్తవ డంతో రాజీనామా చేస్తున్నట్టు

..మిగతా 2 లో








## డెంజర్ జోన్‌లో ప్రపంచ చమురు మార్కెట్లు

2

- మార్చి 4 నుంచి ఇంకా తెరుచుకొని హార్ముజ్ జలసంధి
- రోజుకు 1.4 కోట్ల బ్యారెళ్ల చమురు సరఫరాకు అంతరాయం
- పరిస్థితి మరింత దిగజారితే జులై-ఆగస్టు నాటికి తీవ్ర సంక్షోభం..ఐఈఏ హెచ్చరిక
- ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం ప్రపంచం వ్యాప్త ప్రభావం

## పంట కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



బండి భగీరథ్ విషయంలో సీఎం, కేంద్రమంత్రి కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. నిందితుడు 9 రోజులపాటు పోలీసులకు దొరక్కుండా చూసింది ఎవరని ప్రశ్నించిన కేటీఆర్, ప్రధాని పర్యటన ఉన్నందున కేసు నమోదు చేయలేదని పోలీసులు అనడం సిగ్గుచేటన్నారు. పోక్సో కేసులో నిందితుడిని కాపాడేందుకు సీఎం ప్రయత్నించారని కేటీఆర్ ఆరోపించారు. హైకోర్టులో బెయిల్ రాదని తేలిన తర్వాతే బండి భగీరథ్ను అదుపులోకి తీసుకున్నారన్నారు. అప్పగించామని, అరెస్టు చేశామని సీఎం, కేంద్రమంత్రి కలిసి డ్రామాలు ఆడారని కేటీఆర్ ఆక్షేపించారు. పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము పోరాడకుంటే బాలిక కుటుంబానికి న్యాయం జరిగేది కాదని, తమ పోరాటం, న్యాయవ్యవస్థ వల్లే బాధితులకు న్యాయం జరిగిందని కేటీఆర్ చెప్పారు. భూములు, భూదోపిడీ మీద పెట్టిన శ్రద్ధ రైతుల మీద పెట్టాలి కేటీఆర్ హితవు పలికారు. ఈ ప్రభుత్వం వచ్చాక కోటిన్నర టన్నుల పంట వస్తే సగం కూడా కొనలేదని మండిపడ్డారు. పంటల కొనుగోళ్లపై ఈ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పోరాటాలకు దిగుతుందని ఆయన హెచ్చరించారు. రైతు సమస్యలే ఏకైక అజెండాగా రేపు మంత్రివర్గ సమావేశం జరగాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనటం లేదని రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారన్న కేటీఆర్, అన్నదాతలే కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ధర్నా చేస్తున్నారన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో కూడా రైతులు గురువారం ధర్నా చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. మంచిర్యాల జిల్లాలో నలుగురు రైతులు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎండలో రైతులు పడిగాపులు కాస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనటం లేదని ఒకరిద్దరు రైతులు పురుగుల మందు సేవించారన్నారు. కొన్నిచోట్ల ఎండల తీవ్రతతో ధాన్యం కుప్పల మీదే రైతులు చనిపోయారన్నారు. రాష్ట్రంలో 35 శాతానికి మించి ధాన్యం కొనుగోలు జరగలేదని కేటీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వానికి ఏ విషయంలోనూ ప్రణాళిక లేకుండా పోయిందని చెప్పారు. పంటలు కొనడం లేదు రైతులకు యూరియా దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్లో 34 హామీలు ఇచ్చారన్న కేటీఆర్, వాటిలో ఒక్కటీ అమలు కాలేదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం రైతుబంధును ఇప్పటికే నాలుగుసార్లు ఎగవేసిందన్నారు. భేషజాలకు పోకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రైతు పండించిన అన్ని రకాల పంటలను కొనాలి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం హైదరాబాద్ లోని సచివాలయం ముందు వడ్లు పోసి నిరసన తెలిపారు. సచివాలయం ప్రధాన ద్వారం ముందు కవిత వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, మహిళలు, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలతో కలిసి వరికంకులు, ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బస్తాల్లో తీసుకొచ్చిన వడ్లను కొందరు రైతులు సచివాలయం ముందు పోసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కవితతో సహా రైతులు, మహిళలు, టీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై సమీక్ష చేయలేదని విమర్శించారు. ధాన్యం, ముక్కలు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలు కొనక పోవటంతో రైతులు ఆవేదనతో ఉన్నారని తెలిపారు. తేమ శాతం ఎక్కువ ఉందంటూ ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారనీ, తరుగు పేరిట మోసం చేస్తున్న పట్టించుకునే వారు లేరని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 45 46 డిగ్రీల టెంపరేచర్ లోనూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నా... కొనుగోలు కేంద్రాల్లో కనీసం తాగడాని నీళ్ళు లేవనీ, టెంట్లు కూడా వేయలేదని కవిత ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. వడ దెబ్బకు గురై కొందరు చనిపోతే, పంటలను కొనే వారు లేక, అప్పులు తీరే దారి కనిపించక మరికొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు చనిపోతున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలని, రైతులకు మేలు చేయాలని సచివాలయం వద్ద ధర్నా చేశామని కవిత చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంట కొనటం లేదన్నారు. వెంటనే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఫలక్ నుమా పోలీస్ స్టేషన్ నుంచి బయటికొచ్చాక కవిత మీడియాతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు గ్రేడ్ ఏ వరిని గ్రేడ్ బిగా రిజిస్టర్ చేస్తూ సన్న బియ్యానికి ఇచ్చచే బోనస్ ఎగ్గొడుతున్నారని విమర్శించారు. యూరియా యాప్ ఎవరికి అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు సహా అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.





## ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఏసీబీ వలకు మరో భారీ అవినీతి తిమింగలం చిక్కింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ అక్రమాస్తులపై శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు జరిపి అక్రమాస్తుల గుట్టును రట్టు చేశారు. వాటి ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ.200 కోట్లపైనే ఉంటుందని అంచనా వేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ కు చెందిన ఆస్తులపై ఏసీబీ ప్రత్యేక టీమ్‌లు ఉదయం నుంచే మెరుపుదాడులు సాగించాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఉన్న వంశీమోహన్ నివాసాలు, ప్లాట్లు, ఫామ్‌హౌజ్, వ్యవసాయ భూములపై ఏకకాలంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. వంశీమోహన్ బంధువులు, బినామీల నివాసాల్లోనూ ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఈ సోదాల్లో మొత్తం రూ.4.40 కోట్ల విలువచేసే 19 ఓపెన్ ప్లాట్లు బయటపడ్డాయి. అలాగే వనస్థలిపురంలో ఒక ఇల్లు, మసీదుబండలో మరో ఇల్లు, మణికొండలో ఇంకో ఇంటిని వంశీమోహన్ కలిగి ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ కోట్లల్లోనే ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు. అలాగే ఇంట్లో 122 తులాల బంగారు నగలు, రూ.20 లక్షల నగదు, బ్యాంకు లాకర్లలో మరో రూ.10 లక్షల నగదును కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.32 లక్షల విలువైన రెండు ఖరీదైన కార్లను కూడా నిందితుడు కల్గి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటితో పాటు భూములకు సంబంధించిన దస్తావేజులను కూడా ఇంట్లో కనుగొన్నారు. వీటికి సంబంధించి ప్రస్తుత అధికారిక విలువ రూ.6 కోట్లా 55 లక్షలా 25 వేలు కాగా బహిరంగ మార్కెట్ లో వీటి విలువ రూ.200 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేస్తున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇవేకాక అబ్దుల్లాపూర్ మెట్ లో అతని మామ విజయకుమార్ పేరిట 8 ఎకరాల భూమి కలిగి ఉన్నాడని, ఇది వంశీ బినామీ ఆస్తులే అనే అనుమానం తమకుందని, వాటిపై లోతైన విచారణ జరుపుతున్నామని అధికారులు తెలిపారు. మొత్తం మీద డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితున్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కోర్టు అనుమతితో తిరిగి వంశీమోహన్‌ను తమ కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారణ జరుపుతామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# మీకు ఇంకా రిజర్వేషన్లు అవసరమా..?

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



రిజర్వేషన్ల అంశంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులుగా ఉన్న పిల్లలకు వీటి అవసరం ఏంటని ప్రశ్నించింది. ఈ మేరకు జస్టిస్ బి.వి. నాగారత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యలు చేసింది. వెనకబడిన తరగతుల్లోని సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన వర్గాలకు (క్రీమీలేయర్) రిజర్వేషన్ ప్రయోజనాలకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. "తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్‌లు సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నారు. ఇలా ఒక స్థాయికి చేరుకున్న వ్యక్తులను మినహాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ, మీరు మాత్రం ఆ మినహాయింపుల్ని ప్రశ్నిస్తున్నారు. ఇది కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అంశం. విద్యా, ఆర్థికంగా సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు కూడా మళ్లీ తమ పిల్లలకు రిజర్వేషన్లు కోరుతున్నారు. ఇలాగే కొనసాగితే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేము. తల్లిదండ్రులు ఉన్నత స్థాయికి చేరిన తర్వాత పిల్లల పరిస్థితి కూడా మారిపోతుంది. రిజర్వేషన్ల అమలులో సమతుల్యత అవసరం" అని ఆ పిటిషన్ విచారణలో భాగంగా జస్టిస్ నాగరత్న అన్నారు.

రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొంది సామాజిక, ఆర్థిక సాధికారిత తర్వాత తమ కుటుంబంలోని తర్వాతి తరానికి అదే రిజర్వేషన్ పొందే విషయంలో ఎవరికి వారు పునః పరిశీలించుకోవాలని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు మంచి ఆదాయాలతో మంచి ఉద్యోగాల్లో ఉంటే, పిల్లలకు రిజర్వేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అటు పిటిషనర్ తరపున హాజరైన న్యాయవాది రత్నా ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీమీ లేయర్‌ను గుర్తించడానికి జీతం, ఆదాయం నిర్ణయాత్మక ప్రమాణం కాదన్నారు. క్రీమీ లేయర్ మినహాయింపు కేవలం వారి జీతం, ఆదాయంపై కాకుండా, తల్లిదండ్రుల హోదాపై లేదా సర్వీసులకు చెందినవారా అనే దానిపై ఆధారపడి ఉంటుందని రత్నా వాదించారు. ఒకవేళ జీతాన్ని ఏకైక ప్రమాణంగా పరిగణిస్తే డ్రైవర్లు, ప్యూన్లు, క్లర్కులు, ఇతర తక్కువ స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కూడా రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి మినహాయింపునకు గురవుతున్నారని అన్నారు. పిటిషనర్ కర్ణాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో రిజర్వ్డ్ కేటగిరీ కింద అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టుకు ఎంపికయ్యారు. అయితే, జిల్లా కుల, ఆదాయ ధ్రువీకరణ కమిటీ అతడు క్రీమీ లేయర్‌కు చెందినవాడని నిర్ధరించి, అతడికి కుల ధ్రువీకరణ పత్రాన్ని నిరాకరించింది. అతడి తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులని, వారి ఉమ్మడి ఆదాయం నిర్దేశించిన క్రీమీ లేయర్ పరిమితిని మించిందని అధికారులు గుర్తించారు. పిటిషనర్‌ను క్రీమీ లేయర్‌కు చెందిన వ్యక్తిగా వర్గీకరించడం అనేది, జీతభత్యాలు పొందే ఉద్యోగులైన అతడి తల్లిదండ్రుల ఆదాయంపై ఆధారపడి ఉంది. ఈ క్రమంలోనే వారి ఉమ్మడి ఆదాయం రూ. 8,00,000 దాటినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా, పిటిషనర్ కురుబ సామాజిక వర్గానికి చెందినవాడని ధ్రువీకరిస్తూ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేశారు. అంతకుముందు 2025 జనవరిలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (IAS), ఇండియన్ పోలీస్ సర్వీస్ (IPS) అధికారుల పిల్లలను షెడ్యూల్డ్ కులాలు (SC), షెడ్యూల్డ్ తెగల (ST) నుంచి మినహాయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను వేరొక కేసులో సుప్రీం కోర్టు విచారణకు నిరాకరించింది. స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2024 ఆగస్టులో ఇచ్చిన తీర్పులో SC, ST కోటాల నుంచి క్రీమీ లేయర్‌ను మినహాయించడం గురించిన ప్రస్తావన కేవలం ఒక అభిప్రాయం మాత్రమేనని తెలిపింది. ఈ విషయంలో శాసనసభ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంది.

## 15 జిల్లాలకు రెడ్ అలర్ట్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రాష్ట్రం నిప్పుల కొలిమిలా మండు తున్నది. పగటి పూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిల్లో నమోదవుతున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు ఆయా జిల్లాలకు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అత్యధికంగా 46.1 డిగ్రీల చొప్పున రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లలోనూ 46 డిగ్రీల టెంపరేచర్ రికార్డయింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు సాధారణం కంటే గరిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశముందని హైదారాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెల్లడించారు. 18 జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించారు. ఈ మేరకు ఆ యా జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలనీ, వీలైనంత మేరకు ఎండలో తిరగకూడదని సూచించారు. హెచ్చరికల జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలున్నాయి. ఆ జిల్లాల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగాఉండాలనీ, వీలైనంత మేరకు ఎండలో తిరగకూడదని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

**వేగంగా విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు**

నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు, కోమరిన్, నైరుతి, ఆగ్నేయ, తూర్పు బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలకు విస్తరించే సూచనలున్నాయి. తెలంగాణలో ఎండలు బాగా కొడుతున్నప్పటికీ ఒకటెండ్రు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

**అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు**

పెద్దపల్లి 46.1 డిగ్రీలు
కొమ్రంభీమ్ అసిఫాబాద్ 46.1 డిగ్రీలు
మంచిర్యాల 46.1 డిగ్రీలు
జగిత్యాల 46.0 డిగ్రీలు
జయశంకర్ భూపాలపల్లి 45.9 డిగ్రీలు
నిర్మల్ 45.9 డిగ్రీలు
భద్రాద్రి కొత్తగూడెం 45.7 డిగ్రీలు
ములుగు 45.6 డిగ్రీలు
ఖమ్మం 45.4 డిగ్రీలు
కరీంనగర్ 45.3 డిగ్రీలు

## ఆకునూరి మురళి రాజీనామా

▶▶ మొదటిపేజీ తరువాయి



ఆ లేఖలో ప్రస్తావించారు. 2024 సెప్టెంబర్ 6న ఆకునూరి మురళి చైర్మన్‌గా తెలంగాణ విద్యా కమిషన్‌ను సర్కార్ ఏర్పాటు చేసింది. రెండేండ్ల కాలానికి ఆయన్ను చైర్మన్‌గా నియమించింది.

ఈ ఏడాది సెప్టెంబర్‌తో రెండేండ్ల పదవీకాలం పూర్తికానున్నది. నాలుగు నెలల పదవీకాలం ఉండగానే ఆయన రాజీనామా చేయడం కలకలం రేపుతున్నది. దూకుడు స్వభావం కలిగిన ఆకునూరి విద్యాకమిషన్ చైర్మన్ హోదాలో కొన్ని వివాదాలను మూటగట్టుకొన్నారు. అయితే కొంతకాలంగా ఆయన తీవ్రంగా మదనపడుతున్నారట. ఏం చేయాలన్నది తేల్చుకోలేక రాజీనామాకు సిద్ధపడ్డట్టు తెలిసింది.

విద్యాకమిషన్ తన పదవీకాలంలో 9 నివేదికలను సర్కార్‌కు సమర్పించింది. 434 సిఫార్సులు చేసింది. అయితే కమిషన్ సిఫార్సులను సర్కార్ సీరియస్‌గా తీసుకోలేదు. చాలా అంశాలను పట్టించుకొన్న దాఖలాల్లేవు. పైగా తానొకటి చెబితే.. సర్కార్ మరోటి చేయడం కూడా వివాదం రాజేసింది. దీంతో ఆయన పలుమార్లు బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

మీడియా ఇంటర్వ్యూల్లోను సర్కార్‌పై బహిరంగ విమర్శలు చేశారు. టీచర్లకు జీతాలెక్కువ ఉన్నాయని, తగ్గించాలని ఆయన సిఫార్సు చేయడంతో ఉపాధ్యాయ వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనది. టీచర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాలని, ఎప్‌సెట్ రద్దు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేయాలని సూచించడం కూడావివాదానికి దారితీసింది. ఈ మొత్తం వ్యవహారాల నేపథ్యంలో కేకే కల్పించుకొని ప్రెస్‌మీట్ పెట్టి టీచర్ల జీతాలను తగ్గించబోమని ప్రకటన చేయాల్సి వచ్చింది.

ఇంటర్‌బోర్డును పాఠశాల విద్యలో విలీనం చేయాలని ఆయన చాలాకాలం క్రితం సర్కార్‌కు సూచించారు. కొంతకాలం క్రితం సీఎంతో జరిగిన సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. కానీ అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోలేదు. మొన్నటికి మొన్న హడావుడిగా విలీనం చేసేందుకు ప్రయత్నించి తర్వాత వెనక్కితగ్గారు.

విద్యారంగాన్ని సమూలంగా సంస్కరించడానికి విద్యకు బడ్జెట్‌లో 18శాతం కేటాయింపులు చేయాలని సూచించారు. కానీ సర్కార్ 8.2 శాతం మాత్రమే కేటాయించింది.

ఆకునూరి నేతృత్వంలో విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేసిన సర్కార్ తర్వాత తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపకల్పనకు 2025 ఆగస్టు 29న ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు నేతృత్వంలో మరో కమిటీ వేసింది. ఈ కమిటీలో ఆకునూరి మురళిని సభ్యుడిగా నియమించింది. దీంతో ఒక రకంగా ఆకునూరి కమిషన్‌ను బైపాస్ చేసినదన్న వాదనలున్నాయి. కేశవరావు కమిటీ నియామకంతో ఆకునూరి నేతృత్వంలోని కమిషన్ అప్రాధాన్యంగా మారిపోయింది. మండలానికి రెండు పబ్లిక్‌స్కూల్స్ ఏర్పాటు చేయాలని, చిన్నవాటి స్థానంలో పెద్దవి ఏర్పాటు చేయాలని ఆయన ప్రముఖంగా వాదించారు. ఆరుట్ల స్కూల్‌ను మాడల్‌గా అభివృద్ధి చేశారు. యంగ్ ఇండియా స్కూళ్లకు ప్రాధాన్యతనిచ్చిన సర్కార్ ఈ సూచనలను పట్టించుకోలేదు.

సర్కార్ బడులు బలోపేతం కావాలంటే మూడేండ్లలోపు వారిని చేర్చుకోవాలని, అన్ని బడుల్లో నర్సరీని ప్రారంభించాలని సూచించారు. కానీ ప్రీప్రైమరీ పేరిట.. సర్కార్ 4 ఏండ్లు పైబడినవారికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నది.

**ఐఏఎస్‌తో విభేదాలు..**

ఓ ఐఏఎస్ అధికారితో విభేదాలే ఆకునూరి మురళి రాజీనామాకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. చాలాకాలంగా సదరు అధికారితో ఆకునూరికి మనస్పర్థలున్నాయి. సర్కార్‌లో కీలకంగా ఉన్న ఆ అధికారి విద్యాకమిషన్‌ను అస్సలు లెక్కచేయడం లేదట. సదరు ఐఏఎస్ ఆకునూరి అంటేనే చిర్రుబుర్రులాడుతున్నారట. ఆకునూరి సైతం సదరు అధికారి పేరు ఉచ్చరించేందుకు కూడా ఇష్టపడటం లేదట. ఇటీవలే సర్కార్‌కు విద్యాకమిషన్ సమర్పించిన నివేదికలో కొందరు ఐఏఎస్‌ల పేర్లు ప్రస్తావించగా, సదరు అధికారి పేరు ప్రస్తావించకపోవడం మరింత నిప్పును రాజేసిందట.తెలంగాణ సమాచారం

ఈ నేపథ్యంలోనే ఆకునూరి రాజీనామాకు సిద్ధపడ్డట్టు ఆయన సన్నిహితవర్గాల ద్వారా తెలిసింది. ఆకునూరి రాజీనామాతో విద్యాకమిషన్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకొన్నాయి. ప్రస్తుతం పీఎల్ విశ్వేశ్వర్‌రావు, చారగొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి కమిషన్ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఆకునూరి స్థానంలో కొత్త చైర్మన్‌ను నియమిస్తారా? లేక కేశవరావు కమిటీ చాలన్న భావనతో కమిషన్‌ను పూర్తిగా రద్దుచేస్తారా? ఇప్పుడున్న సభ్యులతో కొనసాగిస్తారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

## డెంజర్ జోన్‌లో ప్రపంచ చమురు మార్కెట్లు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ యుద్ధం భారాన్ని యావత్ ప్రపంచం మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా మార్చి 4 నుంచి హోర్ముజ్ జలసంధి మూసివేత కావడంతో రోజుకు సుమారు 1.4 కోట్ల బ్యారెళ్ల చమురు సరఫరా మార్కెట్‌కు అందడం లేదు. పరిస్థితి మరింత దిగజారితే జులైఆగస్టు నాటికి ప్రపంచ చమురు మార్కెట్లు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లొచ్చని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) హెచ్చరించింది. ప్రపంచ చమురు సరఫరాలో కీలక మార్గమైన హర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు తీవ్రమైన ఒత్తిడిలోకి వెళ్లాయని ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫతిహ్ బిరోల్ హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే వేసవి కాలంలో చమురు కొరత మరింత పెరిగి మార్కెట్లు రెడ్ జోన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. హోర్ముజ్ జలసంధి మూసివేతతో రోజుకు సుమారు 14 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా నిలిచిపోయిందని ఐఈఏ తెలిపింది.

లండన్‌లోని చాతమ్ హౌస్ కార్యక్రమంలో మాట్లాడిన ఫతిహ్ బిరోల్... ప్రపంచ చమురు నిల్వలు క్రమంగా తగ్గుతున్నప్పటికీ డిమాండ్ మాత్రం పెరుగుతోందన్నారు. వేసవి సెలవుల ప్రయాణాలు, పారిశ్రామిక కార్యకలాపాల పెరుగుదల కారణంగా చమురు వినియోగం మరింత అధికమవుతోందని చెప్పారు. హోర్ముజ్ జలసంధిని 'పూర్తిగా, ఎలాంటి షరతులూ లేకుండా' తిరిగి తెరవడమే ఈ సంక్షోభానికి ప్రధాన పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే సభ్య దేశాలు వ్యూహాత్మక చమురు నిల్వలను మరింత విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మార్చిలో కూడా ఇదే విధంగా నిల్వల విడుదల చేపట్టినట్టు గుర్తు చేశారు.

**గత సంక్షోభాల కంటే తీవ్రం**

ఈ సంక్షోభాన్ని 1973, 1979 చమురు షాక్‌లు, అలాగే 2022లో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఏర్పడిన ఇంధన సంక్షోభం కంటే తీవ్రమైనదిగా బిరోల్ అభివర్ణించారు. ఇంధన రంగంపై భౌగోళిక రాజకీయాల ప్రభావం ఇంతగా ఉండటం తానెప్పుడూ చూడలేదని ఆయన వ్యాఖ్యానించారు. యూరప్‌లో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని రైట్ వింగ్ రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం ఉందని కూడా బిరోల్ హెచ్చరించారు. చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులపై ఆధారపడుతున్నప్పటికీ ప్రజల్లో ప్రభుత్వాలపై అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రధాని మోడీ పలు ప్రభుత్వ శాఖలకు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టాలని సూచించారు. దిగుమతయ్యే పెట్రో ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించి.. దేశాన్ని ఇంధన స్వయం సమృద్ధి వైపు తీసుకెళ్లాలని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్, అణుశక్తి, ఎథనాల్ మిశ్రణ, దేశీయ ఇంధన ఉత్పత్తి పెంపు వంటి ప్రత్యామ్నాయాలపై పరిశీలిస్తోంది. అవసరం లేని ఇంధన వినియోగాన్ని తగ్గించే మార్గాలను కూడా గుర్తించాలని ప్రధాని ఆదేశించారు. పశ్చిమాసియా ఘర్షణలు దీర్ఘకాలం కొనసాగితే ద్రవ్యోల్బణం, వాణిజ్య మార్గాలు, ఇంధన సరఫరాలు, విదేశీ మారక నిల్వలపై తీవ్ర ప్రభావం పడవచ్చని మోడీ హెచ్చరించారు. కోవిడ్ కాలంలో జరిగిన ఆర్థిక మార్పుల మాదిరిగా... దీర్ఘకాల ప్రభావాలకు ప్రభుత్వం, దేశ ప్రజలు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించిన విషయం తెలిసిందే.

**ఇరాక్ వంటి దేశాలకు ఇబ్బందులు**

ఇక చమురు ఆదాయాలపై ఎక్కువగా ఆధారపడే ఇరాక్ వంటి దేశాలు ఆర్థిక నష్టాల కారణంగా తిరిగి ఇంధన ఉత్పత్తిలో పెట్టుబడులు పెట్టడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సహా మధ్య ప్రాచ్య దేశాల్లో పూర్తి స్థాయి ఉత్పత్తి పునరుద్ధరణకు కనీసం ఏడాది పట్టవచ్చని అంచనా వేశారు.

ప్రస్తుత ఇంధన సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ మార్కెట్లో చమురు ఆధారిత విధానంపై ఎన్నో సంవత్సరాలుగా ప్రతికూల ప్రభావాలు కనిపిస్తున్నప్పటికీ.. భారత్ ఇంకా దిగుమతయ్యే ముడి చమురుపైనే అత్యధికంగా ఆధారపడుతూ ఉన్నదని పలువురు నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు హోర్ముజ్ జలసంధి మూసివేతతో ఆ బలహీనత స్పష్టంగా బయటపడిందని చెప్తున్నారు. మోడీ సర్కారు 'ఆత్మనిర్భర్ ఎనర్జీ', 'గ్రీన్ హైడ్రోజన్', 'ఎలక్ట్రిక్ మొబిలిటీ' వంటి నినాదాలు ఇచ్చినా... క్షేత్రస్థాయిలో పెట్రోల్‌డీజిల్ వినియోగాన్ని తగ్గించేంత పెద్ద మార్పు ఇంకా కనిపించలేదని విమర్శకులు అంటున్నారు.

## వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ప్రకటించారు. ఇందుకోసం ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్‌డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయమని వివరించారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని అన్నారు. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమని చెప్పారు. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో మరింత సానుకూల దృక్పథంతో బ్యాంకులు ముందుకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై ప్రభుత్వం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని తెలిపారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టిసారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతి సాధిస్తోందని తెలిపారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని భట్టి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏయే రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువగా దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు.





# క్రిస్టియన్ల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బండలగూడ జిఎంఆర్ మార్గ్ లో నూతన చర్చి ప్రారంభం

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

నియోజకవర్గంలోని క్రిస్టియన్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జెపి కాలనీ డివిజన్ పరిధిలోని బండలగూడ జిఎంఆర్ మార్గ్ లో నూతనంగా నిర్మించిన చర్చిని శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో చర్చిల నిర్మాణాలు దోహదపడతాయని తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ప్రేమ, దయ, క్షమాపణ మరియు నిస్వార్థ సేవలను నేర్పుతున్నాయని తెలిపారు. సొంత నిధులతో నియోజకవర్గం వ్యాప్తంగా 30 పైగా చర్చిలు నిర్మించి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నూతన చర్చి నిర్మాణానికి సైతం ప్రభుత్వంతో చర్చించి భూమిని కేటాయించడం జరిగిందని తెలిపారు. చర్చి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, చర్చి ఫాదర్ ఆండ్రూస్, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

- బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

భారతీయ జనతాపార్టీ (బీజేపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తొర్రూరు లో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షులు గట్టు రాంబాబు ల ఆధ్వర్యంలో పంటల కొనుగోలు లో రైతులు పడుతున్న ఇబ్బందులపై తహశీల్దార్ గార్కి వినతి పత్రం సమర్పించారు.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, పంటలు కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రెండు నెలలు కాలం పూర్తయినా కూడా కొనుగోలు చేయకపోవడం దారుణం అని, కొనుగోలు కేంద్రాల్లో తీవ్రంగా జాప్యం జరుగుతోంది అని,గన్నీసంచుల కొరత,హమాలీ కొరత , కారణంగా కాంటాలు వేయడం లేదని,కాంటాలు వేస్తే వాటిని తరలించడానికి లారీలు, ట్రాక్టర్ల కొరత ఉందని,తీరా మిల్లులకు తరలిస్తే వారు తాలు,తరుగు,తేమ పేరుతో ఐదు నుంచి పది కేజీల వరకు తీసేస్తూ రైతుల కష్టాలను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.మక్కల కొనుగోలు కేంద్రాల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, చేతులు తడిపిన వారి మక్కలను కాంటాలు వేస్తూ డబ్బులు ఇవ్వని వారిని పక్కన పెడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని,ఈ సీజన్లో మొక్కజొన్న అధికంగా పంట సాగు చేశారని వ్యవసాయ అధికారులు మక్కల కొనుగోలు పై సరైన అవగాహన , ప్రణాళిక లేకపోవడం వల్ల ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం ,లారీలు ట్రాక్టర్లను అందుబాటులో ఉంచక పోవడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది అని ,రైతులు తీవ్ర ఎండలతో కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతుంటే సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి వర్గానికి ఎలాంటి చలనం లేదు అని రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే కొనుగోలు కేంద్రాల్లో జాప్యాన్ని నివారించి యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా నాయకులు అమ్మాపురం గ్రామ ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, మంగళపల్లి యాకయ్య,మండల ప్రధాన కార్యదర్శులు నడిగడ్డ సందీప్, గుగులోత్ భాస్కర్ నాయక్, గంధం రాజు,నూకల నవీన్, గుండా సురేష్, కొండపల్లి శ్రీనువాస్,తాడిశెట్టి నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

**సికింద్రాబాద్,తెలంగాణ చౌరస్తా:**

హైదరాబాద్ దళిత ఆత్మగౌరవ ప్రతీక, గొప్ప సామాజిక సంస్కర్త, ఆది హిందు సోషల్ సర్వీస్ లీగ్ వ్యవస్థాపకులు స్వర్గీయ భాగ్యరెడ్డి వర్మ 138వ, జయంతి వేడుకలను మాల స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మాదాసు రాహుల్ రావు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ గారు అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళల విముక్తి, విద్యా విస్తరణ కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో "ఆది హిందూ భవన్", "భాగ్యనగర్" భావన, అలాగే "ఆది హిందూ" పత్రిక స్థాపన ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించారని తెలిపారు. 1906 సంవత్సరంలోనే దళిత బాలికల కోసం తెలుగు మీడియం పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. నిమ్న జాతుల సమస్యల పరిష్కారం కోసం "న్యాయ పంచ కమిటీలు", "జగన్ మిత్ర మండలి" వంటి సంస్థలను ఏర్పాటు చేసి సామాజిక న్యాయం కోసం కృషి చేశారని తెలిపారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తో భాగ్యరెడ్డి వర్మ కి ఉన్న సన్నిహిత సంబంధాలు, జాతీయ స్థాయిలో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ పాఠ్యాంశాలలో భాగ్యరెడ్డి వర్మ జీవిత చరిత్రను తప్పనిసరిగా చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాల స్టూడెంట్ జేఏసీ ఓయూ చైర్మన్ దాసరి రవి, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బత్తుల రమేష్, బత్తుల దిలీప్, అంజి బాబు, ప్రవీణ్, భైరు రవి, గణేష్, పాల్గొన్నారు.



# ప్రజల నమ్మకాన్ని నిలబెడుతున్నాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఇస్నాపూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఎంతో నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి కాలనీలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం, ఇస్నాపూర్, చిట్కుల్ వార్డులలో అంతర్గత మురుగునీటి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణ పనులకు పాలకవర్గం సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పారిశ్రామికవాడగా ఉండడంతో పెద్ద ఎత్తున ప్రజలు ఉపాధి పొందుతూ ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకుంటున్నారని పేర్కొన్నారు.. ఇందుకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారం.. పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు, కౌన్సిలర్ పాండు, మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు మమత, వెంకటేష్, ఆంజనేయులు, రాహుల్ రెడ్డి, ఈశ్వరమ్మ, కిషోర్ రెడ్డి, మంజుల, సంధ్య నవీన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, లత, అరుణ్, రాజు, కోఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, నిజాముద్దీన్ బాబా, సోనియా రాజు, ఆసియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో వినూత్న మార్గదర్శన కార్యక్రమం

- విద్యార్థుల సాధికారతే లక్ష్యంగా ప్రారంభించిన టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**




అర్థవంతమైన మార్గదర్శనం, సలహాల ద్వారా విద్యార్థులకు సాధికారత కల్పించే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఒక వినూత్న విద్యార్థి మార్గదర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గీతం వృత్తిపరమైన సలహాల కేంద్రంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ దీనికోసం ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు తమ విద్య, వృత్తి, వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించుకోవడంలో సహాయ పడటానికి 'టాక్ టైమ్' పేరుతో ఒక ప్రత్యేకమైన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ మాథ్యూ 2026 మే 11 నుంచి డిసెంబరు 31 మధ్య కాలంలో, ప్రతిరోజూ సాయంత్రం 4.00 నుంచి 5.30 గంటల వరకు సమయాన్ని కేటాయిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు 15 నిమిషాల చొప్పున వ్యక్తిగత సంభాషణకు (నేరుగా మాట్లాడటం) ఆమె అవకాశం కల్పిస్తున్నారు. శని, ఆదివారాలు మినహా, మిగిలిన అన్ని పనిదినాలలో ఈ సెషన్లు అందుబాటులో ఉంటున్నాయి. నైపుణ్యాభివృద్ధిపరిశ్రమ సంసిద్ధత, వృత్తి మార్గదర్శనంమార్గాలు, మార్గదర్శకత్వంవృత్తిపరమైన అభివృద్ధి, అభిప్రాయాలుఆందోళనలకు సంబంధించిన విషయాలను చర్చించడానికి విద్యార్థులకు సౌకర్యవంతమైన, బహిరంగ వేదికను అందించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం విద్యార్థులను తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మార్గనిర్దేశం కోరడానికి, సహాయక వాతావరణంలో నిర్మాణాత్మక సలహాలను పొందడాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశాన్ని డాక్టర్ రోజీనా మాథ్యూ వివరిస్తూ, విద్యార్థులు తమ ఆలోచనలను బహిరంగంగా పంచుకోవడానికి, ముఖ్యమైన నిర్ణయాలపై స్పష్టత పొందడానికి, వ్యక్తపరచడానికి సంకోచించిన ఆలోచనలను చర్చించడానికి, వారి విద్య, వృత్తిపరమైన ఎదుగుదలను ప్రభావితం చేసే సవాళ్లపై కొత్త దృక్కోణాలను పొందడానికి వీలుగా నిజమైన, అర్థవంతమైన సంభాషణలను సృష్టించడం ఈ టాక్ టైమ్ కార్యక్రమ ఉద్దేశ్యమని చెప్పారు. స్లాట్ల సంఖ్య పరిమితంగా ఉన్నందున, విద్యార్థులు తమ వంతుగా సమయాన్ని పొందేటప్పుడు స్పష్టమైన చర్చాంశాలతో సిద్ధంగా రావాలని, అవకాశాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, సార్థకమైన సంభాషణను చేయాలని ఆమె స్పష్టీకరించారు. విద్యార్థులతో తాను పంచుకున్న క్యూఆర్ కోడ్ లేదా వెబ్ లింక్ ద్వారా అపాయింట్మెంట్లను రిజర్వు చేసుకోవాలని డాక్టర్ రోజీనా సూచించారు.



# మిల్లింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

- తహసీల్దార్,వ్యవసాయాధికారుల ఆకస్మిక తనిఖీ

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

మద్దూర్ మండలంలోని జదవరావుపల్లి గ్రామంలో ఉన్న శ్రీ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును తహసీల్దార్ మహేష్ గౌడ్ మరియు మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రవీణ్ కుమార్ సంయుక్తంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగవంతంగా అన్లోడ్ చేసి మిల్లింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మిల్ యాజమాన్యానికి అధికారులు సూచించారు.ప్రస్తుతం మండలంలోని పలు వరి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం పెద్ద మొత్తంలో నిల్వ ఉండటంతో,అక్కడ నిలిచిపోయిన ట్రాక్టర్లు మరియు లారీలను వెంటనే ఖాళీ చేసి తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు.దీని ద్వారా మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన మిల్లులకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు.రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు,రవాణా,అన్లోడింగ్ ప్రక్రియలు సమన్వయంతో కొనసాగాలని అధికారులు పేర్కొన్నారు.ముఖ్యంగా వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉంచకుండా తక్షణమే మిల్లులకు తరలించడం అత్యంత అవసరమని తెలిపారు.తహసీల్దార్ మహేష్ మాట్లాడుతూ రైతుల శ్రమకు తగిన గౌరవం కల్పించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ,అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రవీణ్ మాట్లాడుతూ పాడి కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యాన్ని వేగంగా తరలించేందుకు రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని,రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ సంయుక్త తనిఖీ సందర్భంగా మిల్ సిబ్బంది,రవాణా కాంట్రాక్టర్లు మరియు సంబంధిత శాఖల సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేశారు.



# టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూటీఎస్ పోరాటాలు

- పిఆర్ సిని వెంటనే ప్రకటించాలి
- ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గన్నోజు ప్రసాద్,కొరవి సుధాకరాచారి

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ టీఎస్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గన్నోజు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొరవి సుధాకరాచారిలు తెలిపారు. శుక్రవారం తొర్రూరు హైస్కూల్ లో ఎస్టీయూ టీఎస్ మహబూబాబాద్ జిల్లా రెండవ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జూన్ రెండు కు పి నివేదిక తెప్పించుకొని మెరుగైన పిఆర్సి అమలు చేయాలని కోరారు.వెంటనే ఉద్యోగులకు మెరుగైన పిఆర్సిని అమలు చేయాలని కోరారు. పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని, ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా ఈహెచ్ఎస్ ను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.కేజీబీవీ, ఎస్ఎస్ఏ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని, మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. 2020 పిఆర్సి లో ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను వెంటనే చెల్లించాలన్నారు. సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు ఎస్టియు పోరాటం చేస్తుందని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, చంద్రప్రకాష్,గుంటుక శ్రీనివాస్,యాకయ్య,సిహెచ్ రమేష్,సంపత్ కుమార్, ఏకాంబరాచారి,సంపత్, హరికృష్ణ చారి,కుమార్, డాక్టర్ ధారావత్ సంతోష్, ఎస్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి.
- అందరికి ఉచిత నాణ్యమైన విద్యను అందించాలి.
- పి.డి.ఎస్.యు - పివైఎల్ - పిఓడబ్ల్యూ

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

ప్రజలను ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న ప్రైవెట్,కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చెయ్యాలని,అధిక ఫీజులను నియంత్రణ చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పిడిఎస్యు,పివైఎల్,పిఓడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కె.కాశీనాథ్ మొదట సంతకం చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కాశీనాథ్,పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ,పిఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి,పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షకార్యదర్సులు వెంకటేష్,మహేష్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ,కార్పొరేట్ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చెయ్యకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ గల్లి గల్లిలో ప్రైవేటు కార్పొరేటు విద్యాసంస్థలకు పర్మిషన్ ఇస్తున్నారు.కనీసమైన నియమాలు పాటించకుండా లాభార్జనే ధ్యేయంగా కొనసాగుతున్న నారాయణ,శ్రీ చైతన్య ఇతర బడా ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడం లేదు. విద్య అనేది సామాజిక బాధ్యత ఆ బాధ్యత నుండి ప్రభుత్వాలు పూర్తిగా వైదొలుగుతున్నాయి.విద్య,వైద్యాన్ని ప్రైవేటు కార్పొరేట్కు అప్పజెప్పడం వల్ల లాభాల కోసం అధిక ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు.ప్రజలు సంవత్సర కాలం పాటు సంపాదించిన దాంట్లో 70 నుంచి 80 శాతం పిల్లల ఫీజులకే కట్టే నిస్సాయస్థితి తల్లిదండ్రులకు ఏర్పడింది.అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్య అందాల్సిన స్థితి లేకపోవడంతో చిన్నచిన్న ఆస్తులని తాకట్టు పెట్టి,అమ్మేసి అయినా సరే చదివించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.దీని మూలంగా సంవత్సరానికి వేలాదిమంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమై నిరక్షరాస్యులుగా మారుతున్నారు.అందుకని ప్రైవేటు కార్పొరేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులని నియంత్రించాలి.పర్మిషన్ లేని వాటిని రద్దు చేయాలి.ప్రభుత్వ విద్య సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి,ఉపాధ్యాయులను నియమించి ఉన్నత వర్గం,పేద వర్గం అనే తేడా లేకుండా అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు.లేనియెడల ప్రజా,విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాస్ లైన్ పార్టీ టౌన్ కార్యదర్శి కెంచి నారాయణ, టి యు సి ఐ జిల్లా కార్యదర్శి రాము,జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహా,ఏఐపికెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు,పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు జె రాము,వై అంజి, పి ఓ.డబ్లు జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి,నాయకులు సుజాత,సునీత,చంద్రకళ,పి.డి.ఎస్.యు జిల్లా సహాయ కార్యదర్శి రాజు,జిల్లా నాయకులు రమేష్,మహేష్,జోగేష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం,మంత్రుల సమక్షంలో దుర్గాప్రసాద్ అభినందన సభ

**ఏన్కూర్, తెలంగాణ చౌరస్తా:**



ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అభినందన సభను ఈ నెల 24న (ఆదివారం) ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్.గార్డెన్స్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఏన్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...., జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 11:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముందుగా,ఉదయం 9:00 గంటలకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ ప్రతిష్టాత్మక అభినందన సభకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపీ ఆర్. రఘురాం రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరిలతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని వెల్లడించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ నేతృత్వంలో జరిగే ఈ సభకు ఏన్కూర్ మండలం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ లచ్చిరాం నాయక్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, జిల్లా కమిటీ కార్యదర్శి సామేలు, రైతు సంఘం నాయకులు మేడ ధర్మారావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు, ముఖ్య నాయకులు మాలోతు నరసింహారావు, దళపతి భువనేశ్వర్ రాజు, పూర్ణకంటి మైసారావు, పంతగాని నరేష్ తదితరులు పాల్గొన్నారు.




# ప్లాస్టిక్ వద్దు ప్రకృతి ముద్దు

- **కాలుష్యం తగ్గిస్తే ఆరోగ్యం పెరుగుతుంది.**
- **జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్ హెచ్.భానుప్రకాష్**

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

సమ్మర్ క్యాంపులో జాతీయ హరితదళం నారాయణ పేట జిల్లా ఆధ్వర్యంలో పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదిరిపాడులో పర్యావరణ విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ విద్యపై అవగాహన,చిత్రలేఖన,పాటల పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్ హెచ్.భానుప్రకాష్ మరియు పాఠశాల జిహెచ్ఎం బాలకిష్టప్ప మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలి.భూమిపై ఎన్నో రకములైన కాలుష్యాలు ఉంటాయి.ప్రస్తుత కాలంలో పర్యావరణ కాలుష్యం మానవాళికి పెను సవాలుగా మారింది.పెరుగుతున్న వాయు,జల,నేల కాలుష్యం వల్ల భూతాపం,అకాల వర్షాలు,తాగునీటి ఎద్దడి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత. చెట్లు నాటడం,ప్లాస్టిక్ వాడకం తగ్గించడం,నీరువిద్యుత్ పొదుపు చేయడం ద్వారా మనం భూమిని కాపాడుకోవచ్చు. 'ఒక్కో విద్యార్థి ఒక్క చెట్టు' కార్యక్రమం కింద మా పాఠశాలలో 500 మొక్కలు నాటి,వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగిస్తున్నాం" అని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమ స్ఫూర్తితో మన ఊరును పచ్చదనంతో నింపుదాం.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి,నీరు అందించడం మన కర్తవ్యం" అని పిలుపునిచ్చారు.చిత్రలేఖనం పోటీలలో ప్రథమ బహుమతి కళ్యాణి,ద్వితీయ బహుమతి జి.రక్షిత,తృతీయ బహుమతి సి.భవాని,కీర్తన గెలుపొందారు.వారికి బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ సి ఆర్ పి కాళప్ప మరియు రవినాయక్,సమ్మర్ క్యాంప్ వాలంటీర్స్ నవీన్,నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.





# రూ.1.50 కోట్ల విలువైన గంజాయి సీజ్

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంతరాష్ట్ర ముఠా గుట్టురట్టు**
- **లారీ, కారులో సీక్రెట్ ఆపరేషన్**
- **అశ్వారావుపేట చెక్‌పోస్ట్ వద్ద నలుగురు రాజస్థాన్ నిందితులు అరెస్ట్**

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసులు జరిపిన భారీ తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి కలకలం రేపింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాలు, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ సూచనలతో అశ్వారావుపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సుమారు రూ.1.50 కోట్ల విలువైన 300 కిలోల గంజాయి పట్టుబడింది. అశ్వారావుపేట ఆర్టీఓ చెక్‌పోస్ట్ వద్ద అంతరాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠాను పోలీసులు వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకున్నారు.
నమ్మదగిన సమాచారంతో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, జీలుగుమిల్లి వైపు నుండి అశ్వారావుపేట వైపు వస్తున్న ఒక మారుతి బాలెనో కారు, ఒక టాటా లారీ అనుమానాస్పదంగా కనిపించాయి. వాటిని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయగా గంజాయి స్మగ్లింగ్ గుట్టు రట్టయింది. బాలెనో కారు డిక్కీలో ఐదు గంజాయి ప్యాకెట్లను, టాటా లారీ కేబిన్ వెనుక భాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య అరలో మరో 25 ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. బ్రౌన్ కలర్ ప్లాస్టర్ టేపుతో ప్యాక్ చేసిన ఈ 30 ప్యాకెట్లలో ఒక్కొక్కటి 10 కిలోల చొప్పున మొత్తం 300 కిలోల గంజాయి ఉన్నట్లు నిర్ధారించి స్వాధీనం చేసుకున్నారు.
ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజేష్ పూరి, షహజాద్ ఖాన్, కమలేశ్ శర్మ, రమేష్ చంద్ర బలై అనే నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ముంచింగిపుట్టుకు చెందిన వంతాల కృష్ణ అలియాస్ విజయ్ కృష్ణ, ఒడిశా బాలిమేళా ప్రాంతానికి చెందిన విక్కీ అనే సప్లయర్ల వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేసినట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. దీనిని రాజస్థాన్‌కు తరలించి, అక్కడ గోపాల్ భీల్ అనే వ్యక్తికి భారీ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనేదే వీరి ప్లాన్ అని తేలింది.
ఈ దాడుల్లో రూ.1.50 కోట్ల గంజాయితో పాటు రవాణాకు వాడిన టాటా లారీ, మారుతి బాలెనో కారు, నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, ప్రస్తుతం పరారీలో ఉన్న మిగిలిన ముఠా సభ్యుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రాణాలకు తెగించి అంతరాష్ట్ర గంజాయి రవాణా ముఠాను పట్టుకున్న అశ్వారావుపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ బృందాన్ని జిల్లా పోలీస్ అధికారి రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# 108 అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

- **నవజాత శిశువుకు ప్రాణం పోసిన 108 సిబ్బంది**
- **సిపిఆర్ టెక్నిక్ సహాయంతో పసిపాప ప్రాణాన్ని రక్షించారు.**
- **అభినందించిన జిల్లా మేనేజర్ సునీల్ కుమార్**



**ధన్వాడ,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా,ధన్వాడ మండల కేంద్రంలోని జయశ్రీ తన రెండో కాన్పు నిమిత్తం దగ్గరలో ఉన్న ధన్వాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది.అక్కడ వైద్యులు పరీక్షించి తనకు నెలలు నిండకముందే నొప్పులు ఎక్కువ కావడంతో హుటాహుటిన దగ్గరలో ఉన్న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి 108 అంబులెన్స్ లో రిఫర్ చేశారు.సమాచారం అందుకున్న సిబ్బంది తక్షణమే ధన్వాడ ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని,జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న మార్గమధ్యలో చిన్నజట్రం దగ్గర మహిళా అంబులెన్స్ లోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది.అప్పుడే పుట్టిన మగ శిశువు ఏడవకపోవడం,కదలికలు లేకపోవడం గమనించిన ఈఎంటి భరత్ వెంటనే సిపిఆర్ టెక్నిక్స్ సాయంతో ప్రథమ చికిత్స చేస్తూ ఊపిరి పోశాడు.వెంటనే తల్లి బిడ్డను జిల్లా ఆసుపత్రికి తరలించారు.అక్కడ డాక్టర్ మహేందర్ పరీక్షించి,శిశు పుట్టగానే ఏడవకపోవడం మరియు బరువు తక్కువగా ఉండడం మూలాన అత్యవసర వైద్యం నిమిత్తం ఉచిత మాత శిశు 108అంబులెన్స్ లో వెంటిలేటర్ సహాయంతో మహబూబ్నగర్ జిల్లా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం పంపించారు.ఈ సందర్భంగా అత్యవసర సమయంలో ఆపద్బాంధవులుగా సేవలు చేస్తున్న 108 సిబ్బందిని,ఈఎంటి భరత్,పైలట్ వెంకటేష్ లను జిల్లా ఆస్పత్రి వైద్యులు పేషెంట్ బంధువులు అభినందించారు.



# ఉపాధి హామీ పనులను పరిశీలన

- **అడిషనల్ కలెక్టర్ శ్రీజ**

**ఏన్కూర్, తెలంగాణ చౌరస్తా:**

ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ శ్రీజ పరిశీలించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్న కూలీలతో పాటు సంబంధిత అధికారులతో ఆమె మాట్లాడి, కూలీల పనితీరును, పనులు జరుగుతున్న విధానాన్ని నిశితంగా పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల సౌకర్యార్థం పనుల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఏన్కూరు ప్రాంతం ప్రస్తుతం రెడ్ జోన్ పరిధిలో ఉన్నందున, కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయాన్నే త్వరగా పనులను ముగించాలని సూచించారు. అలాగే పని ప్రదేశంలో కూలీలకు తప్పనిసరిగా తాగునీరు, నీడ వంటి కనీస వసతులను కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజతో పాటు ఎంపీడీఓ పల్లి భాగ్యశ్రీ, ఏపీఓ సూరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భూక్య ఆనంద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గా గద్వాల్ విజయలక్ష్మి

- **బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న మోతే శోభన్ రెడ్డి**

**సికింద్రాబాద్, తెలంగాణ చౌరస్తా:**




తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్, ట్యాంక్‌బండ్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి పాల్గొని నూతన చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారిక ఉత్తర్వుల మేరకు గద్వాల్ విజయలక్ష్మి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఆమె ఈ రాజ్యాంగబద్ధ పదవిలో ఐదేళ్లపాటు సేవలందించనున్నారు. చైర్‌పర్సన్‌తో పాటు మరో ఆరుగురు సభ్యులు కూడా ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించారు.మహిళల హక్కుల పరిరక్షణ, సాధికారత, సామాజిక న్యాయం మరియు సంక్షేమ పరిరక్షణ దిశగా మహిళా కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న వివక్ష, వేధింపులు, హింస వంటి సమస్యల పరిష్కారంలో కమిషన్ మరింత సమర్థవంతంగా వ్యవహరిస్తుందనే ఆశాభావం వ్యక్తమైంది.ఈ సందర్భంగా మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. నూతన చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి నాయకత్వంలో మహిళా కమిషన్ మరింత ప్రజానుకూలంగా పనిచేసి మహిళల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుందనే నమ్మకం వ్యక్తం చేశారు. అదేవిధంగా కమిషన్ సభ్యురాలు ఉజ్మా షాకిర్‌కు కూడా ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని నూతన చైర్‌పర్సన్ , సభ్యులకు అభినందనలు తెలియజేశారు.



# బట్టర్ మిల్క్ పాకెట్స్ అందజేత

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ ఖాన్ పేట్ గ్రామంలో 100రోజుల పని,హమాలి పని చేసే వారికీ గ్రామ సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో బట్టర్ మిల్క్ పాకెట్స్ అందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిప్పని శ్రావణి శ్రవణ్,వార్డ్ మెంబర్స్ మేడి రాజకుమార్,కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# శ్రీరాములపల్లిలో సందడి చేసిన షార్ట్ ఫిలిం షూటింగ్

**ఇల్లందకుంట, తెలంగాణ చౌరస్తా:**

మానవ సంబంధాల నేపథ్యంలో తెరకెక్కుతున్న భావోద్వేగ కథాచిత్రం.ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామం గురువారం సినీ సందడితో కళకళలాడింది.స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తూ బయ్యారం వీరన్న క్రియేషన్స్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న కొత్త షార్ట్ ఫిలిం షూటింగ్ ఘనంగా ప్రారంభమైంది.గ్రామీణ వాతావరణంలో సహజత్వానికి దగ్గరగా చిత్రీకరణ జరగడం అక్కడి ప్రజల్లో ఆసక్తిని కలిగించింది.ఈ షార్ట్ ఫిలింకు ఆకునూరి అజయ్ దర్శకత్వం వహిస్తుండగా,రాజేందర్ కెమెరామెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.గ్రామీణ జీవన శైలికి అద్దం పట్టేలా,కుటుంబ బంధాలు,మానవ సంబంధాల విలువలను ప్రతిబింబించే విధంగా ఈ చిత్ర కథ రూపొందించబడినట్లు దర్శకుడు తెలిపారు. ముఖ్యంగా వయస్సుతో సంబంధం లేకుండా భార్యాభర్తల మధ్య ప్రేమ,అనురాగాలు, పరస్పర అవగాహన,అన్యోన్యతలు జీవితాంతం నిలిచే బంధమనే సందేశాన్ని ఈ షార్ట్ ఫిలిం ద్వారా ప్రేక్షకులకు అందించనున్నట్లు పేర్కొన్నారు.ఈ చిత్రంలో బయ్యారం వీరన్న, రోజా, మొలంగూర్ పూదరి ప్రసాద్, ఎదులాపురం అశోక్, గారంపల్లి రాజేశ్వరరావు తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.పాత్రలకు అనుగుణంగా నటీనటులు సహజమైన అభినయంతో ఆకట్టుకుంటున్నారని చిత్రబృందం తెలిపింది.గ్రామీణ నేపథ్యంలో సాగే సన్నివేశాలను ఎంతో సహజంగా తెరకెక్కిస్తున్నామని పేర్కొన్నారు.ముఖ్యంగా శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఎదులాపురం అశోక్ ఈ చిత్రంలో నటించడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామానికి చెందిన వ్యక్తి చిత్రంలో నటించడం పట్ల గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ,ఆయనకు అభినందనలు తెలిపారు.స్థానిక కళాకారులకు ఇలాంటి అవకాశాలు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.షూటింగ్ కార్యక్రమం శ్రీరాములపల్లిలోని ఎదులాపురం నరేందర్ ఇంట్లో నిర్వహించారు.ఇంటి ఆవరణలో కుటుంబ భావోద్వేగాలకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరించారు.షూటింగ్‌ను తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.స్థానికంగా చిత్రీకరణ జరగడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇంకా రెండు రోజుల పాటు శ్రీరాములపల్లిలోనే షూటింగ్ కొనసాగనున్నట్లు దర్శకుడు ఆకునూరి అజయ్ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న కళాకారులను ప్రోత్సహిస్తూ, సమాజానికి మంచి సందేశం ఇచ్చే విధంగా చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.విడుదల అనంతరం ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే ఆశాభావాన్ని చిత్రబృందం వ్యక్తం చేసింది.






# ఓదెల గ్రామ పంచాయతీ సిబ్బంది శభాష్

- **సర్పంచ్ సతీష్ కు అభినందనల వెల్లువ**

**ఓదెల, తెలంగాణ చౌరస్తా :**

ఓదెల మండల కేంద్ర సమీపంలోని ఐకేపీ ప్యాక్ వడ్లు మక్కల కొనుగోలు సెంటర్ ల సమీపంలో పొలాల నుండి మంటలు చెలరేగగా ఓదెల సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ తమ గ్రామ పంచాయతీ సిబ్బంది, వాటర్ ట్యాంక్ తీసుకెళ్లి సకాలంలో స్పందించి సమయస్ఫూర్తితో మంటలు ఆర్పడం జరిగింది మక్కల కొనుగోలు సెంటర్ నిర్వాహకులు తీర్థలశ్రీను,ఐకేపీ సిబ్బంది రైతులు ఓదెల గ్రామ పంచాయతీ సర్పంచ్ కి మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులు వంగ సదానందం తదితరులు మాట్లాడుతూ,..సర్పంచ్ గ్రామపంచాయతీ సిబ్బంది సకాలంలో స్పందించి లక్షల విలువలగల పంటను కాపాడిన సిబ్బందికి సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఓదెల సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ మాట్లాడుతూ....భూమిలో కోట్ల విలువైన పోషకాలు ఉంటాయని అవి పంట పొలాలలో భూసారాన్ని కాపాడి పంటకు దిగుబడిని ఇస్తాయని కొయ్యకాలు ను కాల్చడం వల్ల పొలాలలో సూక్ష్మజీవులు చనిపోయి పంట దిగుబడి తగ్గించడమేకాక అనుకోని ప్రమాదాలు జరిగి రైతులకు ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని దయచేసి ఎవరుకూడ పొలాల్లో కొయ్యకాలును కాల్చవద్దని అన్నారు.




# వరంగల్ అభివృద్ధికి కేంద్రం మహర్దశ

- **అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద భారీ నిధుల మంజూరు**
- **వరంగల్ నగర రూపురేఖలను మార్చేందుకు మోదీ కృషి**
- **బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హర్షం**



**వరంగల్, తెలంగాణ చౌరస్తా:**

అర్బన్ ఛాలెంజ్ ఫండ్' (యు సి ఎఫ్ ) కింద తెలంగాణపై నిధుల వరద పారించిన ప్రధాని నరేంద్ర మోదీనాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం,3 ప్రధాన ప్రాజెక్టుల కోసం రూ. 5,681 కోట్లను మంజూరు చేయగా,ఇందులో మన వరంగల్ కోసం ఏకంగా రూ. 4,674కోట్ల భారీ ప్యాకేజీని ఆమోదించడం ఎంతో సంతోషకరమని బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...తెలంగాణకు దక్కిన 3 మెగా ప్రాజెక్టులు మంజూరు అయ్యాయని,రూ. 4,674 కోట్లతో వరంగల్ మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణ,రూ. 840 కోట్లతో కరీంనగర్ లో మోడల్ రోడ్లు & మౌలిక సదుపాయాలు,రూ. 166 కోట్లతో ఖమ్మంవరంగల్‌కరీంనగర్ కారిడార్ చేయడం జరిగిందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యు సి ఎఫ్) కింద గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ) ఆధునికీకరణ ప్రాజెక్టుకు రూ. 4,674.6కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలపడంపై బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ త్రినగరాల (వరంగల్‌హనుమకొండకాజీపేట) ప్రజల దశాబ్దాల కల అయిన భూగర్భ డ్రైనేజీ సమస్యకు ఈ నిధులతో శాశ్వత పరిష్కారం లభించబోతోందని పేర్కొన్నారు.తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ భారీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని,ఈ ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం రూ. 1,168.65కోట్ల భారీ గ్రాంటును నేరుగా సమకూర్చడమే కాకుండా, జర్మన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా రూ. 2,337.30కోట్ల రుణ సదుపాయాన్ని కూడా ఖరారు చేసిందని,ఇది వరంగల్ ప్రజలపై నరేంద్ర మోదీకి ఉన్న ప్రత్యేక ప్రేమాభిమానాలకు నిదర్శనం." అని అన్నారు.గతంలో స్మార్ట్ సిటీ మిషన్ ద్వారా వరంగల్ అభివృద్ధికి వందలాది కోట్లు అందించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మొత్తం రూ. 5,681 కోట్ల విలువైన మెగా ప్రాజెక్టులను మంజూరు చేసిందని రవికుమార్ గుర్తుచేశారు.వరంగల్ నగర భవిష్యత్తుకు వెన్నెముకగా నిలిచే ఈ చారిత్రాత్మక నిర్ణయానికి అండగా నిలిచిన కేంద్ర ప్రభుత్వానికి,ప్రధాని మోదీకి వరంగల్ నగర ప్రజల తరఫున బిజెపి శ్రేణులు ధన్యవాదాలు.